# కోరిక తీరే వేళ

తనది గంటు మొహమా?

దొప్ప చెవులూ, పిల్లి కళ్ళూనా?

పొట్టిగా లావుగా నల్లని సిద్దిలా ఉంటాడా?

తనంత అనాకారి ఈ లోకంలో లేదూ?

తనకెవ్వడూ పిల్ల నివ్వడూ?

చూసి చూసి ఏ కారివీ తనని కోరుకోదూ?

ముప్పై ఏళ్ళు కాదు నూట ముప్పై ఏళ్ళయినా తనిలా బ్రహ్మచారిలా ఉండి పోవలసిందే!

తనకింకీ జన్మకి పెళ్ళి కాదూ?

హాయిగా ఉండే ఆడదాని అనురాగం, తీయగా వళ్లు ఝల్లు మనిపించే వెచ్చని స్త్రీ స్పర్శా, ఇవేవీ తనకి లభించవూ? ఏ అనుభవంలేని ఒక తుమ్మ మొద్దులా, ఒక గండ శిలలా ఇలా తను పడిఉండలసిందే!

నిత్యమూ తనలో తలెత్తుతూ తనని వేధిస్తూన్న కోరిక లన్నింటినీ ఎలా అణచుకోవడం? ఈ నరక యాతన ఎలా భరించడం?

తనకింక వేరే దారి లేదూ?

తన ఖర్మ ఇంతేనా?.... ఇంతే? .....

గట్టిగా గొంతెత్తి అరిచెయ్యాలనీ, బాధంతా తీరేలాగా బిగ్గరగా ఏడ్చెయ్యాలనీ అనిపించింది రామనాథానికి. మనస్సంతా వెలితిగా, ఏదో చికాకుగా, తిక్కగా ఉంది.

లోకంమీదా, లోకంలో ఉన్న మనుష్యులమీదా విపరీతమైన కక్షగానూ చెప్పలేనంత పచ్చి కసిగానూ ఉంది. అందమైన ఆడవాళ్ల నందర్నీ పట్టుకొని చావ బాదెయ్యా లనిపిస్తోంది.

పెళ్ళికాని ఆడపిల్లలతో పక పక లాడుతూ కబుర్లు చెబుతూన్న బ్రహ్మచారులు కనిపించినా, భార్యని వెనకాల స్కూటర్ మీద కూర్చోపెట్టుకుని ఠీవిగా పోతున్న మగరాయుళ్ళని చూసినా, పార్క్‌లో జంటల్నీ పేవ్‌మెంట్ మీద దంపతుల్నీ, ఎవళ్ళని చూసినా సరే, అమాంతం వెళ్ళి వాళ్ళ గొంతులు నులిమి చంపెయ్యా లన్నంత పిచ్చి కోపంగా ఉంది.

కోపంతో వళ్ళంతా ఊగిపోతోంది.

ఉద్రేకంతో అణువణువూ కాగిపోతోంది.

లాభం లేదు - తనవల్ల కాదు - ఇంకీబాధని తాను అణుచుకోలేడు.

మంచీ చెడూ మాట దేవుడెరుగును. మర్యాదా గౌరవం అంటూ ఓ మూల కూర్చోవడం తనవల్ల కాదు. అందరిలాగే తనకీ ఆనందం కావాలి! తనూ ఒక్క క్షణం సౌఖ్యం అంటే ఏమిటో రుచి చూడాలి. తప్పయినా సరే. పదిమందీ ముక్కుమీద వేలేసుకొన్నా సరే. తను అనుభూతి పొందాలి! ఆ ఆనందం తనకి లభించాలి!

అందుకోసం తను ఏవైనా చేస్తాడు.

ఆc!..... ఏమైనా చేసేస్తాడు.

ఇలా ఓ నిశ్చయాని కొచ్చి, పెద్ద పెద్ద అంగ లేసుకుంటూ బయల్దేరిన రామనాధం రూపాన్ని చూసి, దారిన పోతూన్న పెద్దవాళ్లు కొయ్యబారి పోయారు. పిల్లలయితే ఝడుసుకుని భయంతో గిట్టకరుచుకొనే పోయారు.

రామనాధం మనస్సులో వెయ్యి అగ్నిపర్వతాలు.

గుండెలో లక్ష జలపాతాలు - మెదడులో కోటి భూకంపాలు

వళ్ళంతా వణికిపోతోంది - మనిషి ఏకంగా ఊగిపోతున్నాడు.

అప్పటికే ఆ గల్లీనిండా చీకట్లు ముసురుకొంటున్నాయి. తలలు నెరిసిన వాళ్ళు తత్త్వాలు వాదించుకుంటున్నారు. పది పదిహేనుగురయితే, సారా దుకాణం దగ్గర తెగ గలాభా చేస్తున్నారు. తూములుమీద వీధి లాంతరు వెలుగులో కూచుని, బ్రేకెట్ సంకేతాన్ని నిశితంగా పరిశీలిస్తూన్న గళ్ళులుంగీల ఆసామీలు, రామనాధాన్ని

గమనించనే లేదు. మధ్యమధ్య బీడి దమ్ము లాగి, కాగితాలు చూస్తున్నారు. వాళ్ళ లోకంలో వాళ్లున్నారు.

రామనాథం ఆ గల్లీలో ఇంకొంచెం ముందుకి వెళ్లి ఆగాడు. రిక్షాలోంచి బెరుకు బెరుగ్గా దిగుతూన్న గ్లాస్కో పంచెలూ గొట్టాం పేంట్లూ కంగారు కంగారుగా అటూ ఇటూ ఉన్న ఇళ్లల్లోకి తప్పుకుంటున్నాయి. రోడ్డు మధ్యన పడిఉన్న ఓ పాత గుడ్డ పీలికకోసం రెండు మూడు కుక్కలు పోట్లాడుకొంటున్నాయి. నడివయస్సు దాటిన బుర్ర మీసాల నల్లముఖాలు, కిళ్ళీలూ మల్లెపువ్వులూ అమ్ముతూ, మధ్యమధ్య వయస్సు వచ్చీ రాని పదిపన్నెండేళ్ళ అమ్మాయిలతో మోటుసరసాలాడుతూ పగలబడి నవ్వుతున్నాయి. ఆ పడుచుపిల్లల గారపట్టిన పళ్లూ, కోపంతో ఎర్రబడిన కళ్లూ, అసలే సాయంకాలం ఎండలో రక్తం పులుముకొన్న ఆ గల్లీని మరింత ఎర్రగా చేస్తూ, ఉద్రేకంతో జేవురించిన రామనాథం కళ్ళకి, ఆవులించిన ఆడసింహం నోరులా కనిపించింది.

తాగుబోతుల కేకలతో, కుక్కల అరుపులతో, రిక్షాగంటల చప్పుళ్ళతో, ఆడవాళ్ళ నవ్వులతో, చీకటి పడుతూన్న ఆ సమయంలో, అప్పుడే నిద్రలేచి వళ్ళు విరుచుకుంటూన్న నవ నాగరికతలా ఉంది ఆ గల్లీ. రకరకాల పువ్వుల మత్తుతో, స్నో పౌడర్ల వాసనలతో ఒలకబోసిన సెంటు సీసాలాఉంది.

ఆ గల్లీలో ఇంకొంచెం ముందుకెళ్ళి తల పైకెత్తి చూశాడు రామనాథం. ఆ మసక వెలుతుర్లో నీడల్లా కనిపించారు డాబాలమీదా కిటికీల దగ్గరా కలకల్లాడు తూన్న కళ్ళతో పలకరిస్తూ, అందంగా అలంకరించుకొన్న ఆడవాళ్ళూ, వాళ్ళతో కబుర్లు చెబుతూ నవ్వుతూన్న మగవాళ్ళూను.

రామనాథం ఒళ్ళంతా ఉద్రేకంతో భగ్గుమంది. నరాలన్నీ మెలిపెట్టేస్తున్నట్టు బాధా, కీలుకీలు యమ యాతనాను. ఇంకో రెండడుగులు ముందుకేశాడు.

ఎదురుగుండా గుమ్మందగ్గర ఒక యువతి మెరుపులా మెరిసింది. ఒంటరిగా ఉన్న ఆ యువతికళ్ళల్లో ఎంతసేపటినుంచో వేచివున్న ఆవేదన-ఎవరికోసమో ఎదురుచూస్తున్న నిరీక్షణ-అంతే-అదిచాలు. ఆహ్వానంగా స్వీకరించాడు రామనాథం.

కోరిక అంతా కళ్ళల్లో నింపుకుని దగ్గరగా వచ్చినిలబడ్డ రామనాథాన్నీ, అతన్ని రూపాన్నీ చూసి భయంతో ఓ వెఱ్ఱికేక వెయ్యిబోయి, ఆమట్టునే ఉండిపోయింది. రెండు రోజులు నీటిలో నాని అసహ్యంగా ఉబ్బిపోయి, చేపలు కొరికెయ్యడంవల్ల

వికృతంగా మారిపోయిన, ఓ భయంకరమైన శవం నడిచివచ్చినట్లు అనిపించి, గజగజా వణికిపోయి గోడకి ఆమట్టునే గిట్టకరుచుకు పోయింది.

చైతన్యం చచ్చిపోయి, కాంతి హరించుకుపోయి, భయంతో ముఖం అంతా పాలిపోతున్న ఆ అందాల రాసిని చూసి నిస్పృహతో నీరైపోయాడు రామనాథం. ఉద్రేకం, ఉత్సాహం నశించి నిరాశతో గిరుక్కున వెనక్కి తిరగబోయాడు.

కొంచెం సేపటికి మనస్సులో ఏం సర్దుకుందో ఏమో, బరువుగా నిట్టూర్చి, ముఖంలో అంగీకారాన్ని సూచించి, లోపలికి దారితీసింది ఆ యువతి. ఒక్క క్షణం తటపటాయించి చివరికి వెనకాలే అనుసరించాడు రామనాథం.

గాలీ వెలుతురూ సరిగారాని ఆ గది, చాలా కాలంగా తలుపులు తియ్యని ఇల్లు లాగ ముక్క వాసన వేస్తోంది. రామనాథం జేబురుమాలు తీసి ముక్కుకి అడ్డం పెట్టుకున్నాడు. అతను పడుతూన్న అవస్థ చూసి, రెండు చవకరకం అగరువత్తులుంటే అవి వెలిగించడానికి టేబిల్ దగ్గరికి వెళ్ళింది ఆ అమ్మాయి.

ఈలోగా తక్కువ కేండిల్ బల్బ్ పరుస్తున్న మసక వెల్తుర్లో, ఆ గదినంతా పరిశీలించసాగాడు రామనాథం. అతను కూర్చున్న ఒక చెయ్యిలేని కుర్చీకి దగ్గిరగా ఓ మంచం, దాని మీద ఉండలు కట్టిన పరుపూ, రకరకాల నూనె జిడ్డుల్తో మకిలిపట్టిన రెండు తలగడాలు, దానికి ఇటువేపున ఉన్న షెల్ఫులో విరిగిన దువ్వెనా, చవక రకం పౌడరు డబ్బా, సవరం, జడపిన్నులూ,అటువేపున దూరంగా టేబిల్ మీద పాత సినిమా పాటల పుస్తకాలూ, విరిగిన ఫ్లవర్ వాజ్, పొగ చూరిన, అగరు వత్తులు గుచ్చుకొనే పింగాణీ ఏనుగు.

జిడ్డు పట్టిన జేగురు రంగులోకి మారుతూన్న గోడమీద పెన్సిల్‌తో రకరకాల దస్తూరీలలో రాసిన వంకర టింకర అక్షరాల ఎడ్రస్‌లూ, ఓ మూల అంచులేని కుండా, నీళ్ళూ, పక్కనే సీవెండి మగ్గూ, ఓ వేపుగోడకి పాతగాజులు తగిలించిన మేకూ. మరో వేపు తడకకి, అంటించిన లైపిండి ఎండడం వల్ల, బిర్రబిగిసి అసహ్యంగా చిరిగి వేళ్ళాడుతున్న సినీతారల బొమ్మలూను.

ఆ వాతావరణం, గదిలో కనిపిస్తూన్న ఆ వస్తువులూ, ఇవన్నీ చూసేసరికి అంత ఉద్రేకంలోనూ రామనాథానికి ఒక్కక్షణం అసహ్యంవేసి విరక్తితో "పోనీ వెనక్కి వెళ్ళి పోదామా!" అనుకున్నాడు. అలా అనిపించింది ఒక్క క్షణమే! మరుక్షణంలో ఎక్కడలేని వ్యామోహం ముంచుకొచ్చేసింది రామనాథానికి, అగరవత్తులు వెలిగించి ఒయ్యారంగా మంచాన్ని ఆనుకుని నిలబడ్డ ఆ అమ్మాయిని చూసేసరికి.

ఆలశ్యాన్ని భరించలేక, కుర్చీలోంచి ఉవ్వెత్తుగా లేచాడు. కళకళలాడుతూన్న ఆమె ముఖం, చెదురుతూన్న ఆమె చూపులూ, భయంభయంగా నిలబడిన ఆ తీరూ ఇవన్నీ అసలే ఆకర్షణీయంగా ఉన్న ఆ యువతిని మరింత ఆకర్షణీయంగా చూపిస్తున్నాయి.

పట్టలేని వ్యామోహం! భరించలేని ఆవేశం! వొళ్ళంతా విపరీతంగా వేడెక్కి ఉద్రేకంతో ఊగిపోతూ నరాలన్నీ మెలితిరిగిపోతున్నాయి. రామనాధానికి కీలు కీలు దగ్గరా పీకుతున్నట్లు నీరసం. బాధో సుఖమో తెలియని కంగారు. ఆమె వేపు అడుగు వేస్తూన్నాడు కానీ అడుగులు గాలిలో తేలిపోతున్నాయి. బారెడు దూరంలో ఉన్న మంచం ఆమడ దూరంలా కనిపిస్తోంది.

రామనాధం ఆమెని సమీపించాడు. చేతులు జాపి ఆమెని అందుకోబోయాడు. గట్టిగా తన బాహువుల్లో బంధించబోయాడు. జీవితంలో తను మొదటిసారిగా వొక కొత్త అనుభూతిని పొందబోతున్నాడు. వొక కొత్త ఆనందం లభించబోతోంది. ఇన్నాళ్లుగా తను ఎదురుచూసి తపించిపోయిన ఆనందం, తనకి అందకుండా దూరంగా ఉండిపోయిన దివ్యానందం అది ఇప్పుడు తనది అవుతోంది .... అవుతోంది .... అవును ..... తనది .... తనది .....

ఇంతలో ఖంగ్‌మని తడక అవతలనుంచి ఓ కంఠం!

ఆ అరుపుకి ఝుడుసుకున్న పసిపిల్ల ఏడుపు!

"తిండిలేకపోతే ఏదో చాకిరీ చేసుకుని బతకాలి కాని, సంసారాలు వెలగబెట్టిన వాళ్ళకికూడా ఇదేం పొయ్యేకాలం! ఈ ముదనష్టపు మొహాలు వచ్చాక మా రేట్లు కూడా పడిపోయాయి ధూ".

పక్కనే పిడుగు పడ్డట్టు ఆగిపోయాడు రామనాధం.

మొహంమీద కొరడాతో కొట్టినట్లు నిస్తేజురాలైపోయింది ఆమె.

తడక అవతలనుంచి ఆ కంఠం ఇంకా ఖంగ్ మంటూనే ఉంది.

గదిమూల, టేబిల్ వారని నేలమీద, పాతగుడ్డల వెనక, దొర్లుతూన్న పసిపాప ఏడుస్తూనే ఉంది దీనంగా అతి దీనంగా.

నీరసంగా, జాలిగా, గుండెల్ని కోసేస్తూ వినిపిస్తూన్న ఆ పసిపాప ఏడుపు ఎక్కడనుంచా అని రామనాధం చుట్టూ పరకాయించాడు. గది మూలని పాత గుడ్డల వెనక నేలమీద దిక్కులేకుండా ఏడుస్తూ కనిపించింది నెలల గుడ్డు.

అనాకారి రామనాధం హృదయం జాలితో నిండిపోయింది. ఆ ఏడుపు అతని గుండెలకి చల్లగాలిలా తగిలింది. నిలువెల్లా వణికించేసే ఆ నీరసమైన ఏడుపు వినలేక – "ఎవరీ పిల్ల?" అనుకున్నాడు.

ఆ మాటలు పైకే అన్నాడేమో అతనికి తెలియదు.

"నా కూతురే" అని ఆమె ధైర్యంగా చెప్పలేకపోయింది. నేరస్థురాలిలాగ తలవంచేసింది.

"ఎందుకేడుస్తోంది?"

"ఎంత వెఱ్ఱి ప్రశ్న" అనుకుంది ఆమె.

"ఆకలేస్తోందేమో!" బాధగా అన్నాడు రామనాధం.

"ఏమో ఏమిటి? ఆకలేస్తోంది. అందుకే ఏడుస్తోంది. అందుకే ఏడుస్తోంది" ఈ మాటలు ఆమె పైకి అనలేదు. ఓ మారు పాపకేసి చూసి ఊరుకోవడంవల్ల, రామనాధానికే అనిపించింది ఆమె అలా అందేమోనని.

"అంతలా బాధగా నీరసంగా ఏడుస్తూంటే చూస్తూ ఊరుకోకపోతే కాసిన్ని పాలుపట్టించ కూడదూ?" గొంతు జీరపోతూంటే, కరిగిపోతూన్న గుండెని చిక్కపట్టుకుంటూ అన్నాడు రామనాధం.

అతని ప్రశ్నవిని గుడ్లప్పగించి కొంచెం సేపు అతనికేసి చూసి, ఆ తర్వాత సాహసంచేసి నీరసంగా నవ్వింది.

అది నవ్వుకాదు. నవ్వులా వినిపించిన విషాదకరమైన మూలుగు! "ఎంత వెఱ్ఱివాడవయ్యా! పాలు ఉంటే పట్టించను వేరే చెప్పాలా?... నిన్నటినుంచి పాలసీసా లోకి నీళ్లు పోసి, ఉత్తి పాలతిత్తిని నోటికి అందించి మోసం చేస్తూ వచ్చా. పొద్దుటి నుంచీ ఆ మోసంకూడా పనిచెయ్యకపోతే నేనేం చేసేదీ? నన్నేం చెయ్యమంటావు?" అంటూ గబగబా అనేసి, ఆ తర్వాత బావురుమని ఏడ్చిన ఏడుపులా ఉంది అది.

అలాంటి ఏడుపులాంటి నవ్వు నవ్వాక, ఆమె ముఖం వివర్ణం అయి పోయింది. వివర్ణమైన ముఖాన్నీ, నీళ్ళతోనిండిన కళ్ళనీ చూపించలేక తల వంచేసింది. ఆమె దీనావస్తని చూసి చలించిపోయాడు రామనాధం. అతని వంట్లో మాంసాన్నంతా ఎవరో ఇనపచేతుల్తో పిండేస్తున్నట్లూ, రక్తాన్నంతా దెయ్యపు నాలికతో పీల్చేస్తున్నట్లూ బాధపడ్డాడు. ఆమెకేసి జాలిగా చూసి "చేతిలో డబ్బులేదా! ... లేకపోతే...." ఆ వాక్యాన్ని ఎలా పూర్తిచేయాలో తెలియక ఆమట్టుని ఆగిపోయాడు.

అతని మాటలు వింటూనే నేలమీద చతిగిలపడిపోయి మోకాళ్ళమీద తల పెట్టుకుని, రెండు చేతుల్తోటీ ముఖాన్ని కప్పుకుని వెక్కివెక్కి ఏడవడం ప్రారంభించింది ఆమె.

రామనాధం తెగ కళవళ పడిపోయాడు.

ఉత్సాహం, ఉద్రేకం అంతా చచ్చిపోయి. చలనంలేకుండా స్థాణువులా గుడ్లప్పగించి చూస్తూ అలా ఉండిపోయాడు.

జాలిగా పసిపిల్ల ఏడుపు!

దీనంగా ఆమె పడుతూన్న ఆవేదన!

రెండు కంఠాలలోనూ నీరసం, నిస్సహాయతా, గుండెల్ని కరిగించేసే దైన్యమైన విషాదమూను.

ఆ ఏడుపు వినేసరికి, రామనాధానికి ఒక భయంకరమైన సత్యం అర్థం అయినట్లు అనిపించింది.

'నిజంగానా? కన్న కూతురు కడుపు నింపుకోలేక, ఆకలి పెట్టేహింసకి తట్టుకోలేకే ఈమె ఈ దౌర్భాగ్యానికి అంగీకరించిందా?'

ఇంకాపైన ఆలోచించలేకపోయాడు.

లోకం అంతా ఒక్కమారు గిర్రున తిరిగి ఆగినట్లనిపించింది.

కంగారు కంగారుగా జేబులో ఉన్న నోట్లు తీసి ఆమె మోకాళ్ళ మీద ఉంచి, ముఖం ఆమెకి చూపించకుండా అటుతిరిగి, తడబడుతూ అడుగు కదిపాడు.

ఉలిక్కిపడి ఆమె తలఎత్తి చూసేసరికే రామనాధం గడపదాటుతున్నాడు.

అతనిలోని మానవీయతకి ఆమె చేతులెత్తి నమస్కరించింది.

వీధి లాంతరు వెలుగుపడి అతను మరింత వెలిగినపుడు, తూముల మీద కూర్చున్న గళ్ళులుంగీ ఆసామిలు, ఈ గంటుమొహానికికూడా గుంట కావలసి వచ్చిందోయ్! అని నవ్వుకున్నారు.

అతనా నమస్కారాన్నీ పట్టించుకోలేదు, ఈ నవ్వునీ పట్టించుకోలేదు.

ఆవేళ ఉద్రేకాలకీ, కరుణా మానవీయతలకీ మధ్య ఏర్పడిన సంఘర్షణలో పడి నలిగిపోతూ, భయంకర సత్యంలా తనని వెన్నాడుతూ వస్తూన్న పసిపిల్ల ఏడుపూ, పడుచుతల్లి ఆవేదనా ఉండుండి జ్ఞాపకం వచ్చి నిలువెల్లా కాగిపోతూ, గబగబా చీకట్లోకి

తప్పుకొన్నాడు ఉవ్వెత్తుగా తనలోలేచిన కోరిక తీరకుండా హతాశుడైన రామనాథం.

అలా ఆ రాత్రి చీకట్లో కలిసిపోయిన రామనాథం, ఆ తర్వాత ఎవరికీ కనిపించలేదనీ, తన అనాకారి రూపం చూపించి ఎవరినీ బాధించలేదనీ, ఎంత మంది గమనించారు?

లోక వ్యవహారం మామూలుగా నడుస్తూనే ఉంది.

కాలమూ గడుస్తూనే ఉంది.

ఆ గల్లీలో పసిపిల్ల పాలులేక అప్పుడప్పుడు ఏడుస్తూనే ఉంది.

---

(స్వాతి సంక్రాంతి ప్రత్యేక సంచిక, 1972)

*